PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :200 | పేజీలు : 8 | వెల రూ.5 | బుధవారం 12.08.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh






# ఎర్రకోటపై ముందుగా..
# వందేమాతరం

## ఆగస్టు 15న తొలిసారిగా జాతీయ గీతానికి ముందు ఆలాపన..

150 ఏళ్ల సందర్భంగా కేంద్రం కీలక నిర్ణయం

'వందేమాతరం' అనంతరం

జాతీయ జెండా ఆవిష్కరణ.. ఆ తర్వాత 'జనగణమన'

ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో చారిత్రక ఎర్రకోటపై 'వందేమాతరం' గేయం ప్రత్యేకంగా ప్రతిధ్వనించనుంది. ఆగస్టు 15న నిర్వహించే వేడుకల్లో జాతీయ గీతం 'జనగణమన'కు ముందు తొలిసారిగా 'వందేమాతరం'ను ఆలపించనున్నారు. ఈ గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు డిఫెన్స్ సెక్రటరీ ఆర్.కే. సింగ్ తెలిపారు.

ఢిల్లీ, ప్రభాత సూర్యుడు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల (ఆగస్టు 15) వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. ప్రతీ పౌరుడు తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి, దేశభక్తిని చాటుకోవాలని కోరుతూ ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో మంగళవారం ఒక ప్రత్యేక వీడియోను పోస్ట్ చేశారు. "హర్ ఘర్.. ఘర్ ఘర్.. హర్ మన్ తిరంగా" (ప్రతీ ఇంటా.. ప్రతీ మనసులోనూ త్రివర్ణ పతాకం) అనే స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండుగలా, గర్వంగా జరుపుకోవాలని ప్రధాని కోరారు. దేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధులను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ వారికి ఘనంగా నివాళులు అర్పిద్దామని పిలుపునిచ్చారు.

**వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ..**

అభివృద్ధి చెందిన భారత్ (వికసిత్ భారత్) కల నెరవేరేందుకు ప్రతీ పౌరుడు పునరంకితం కావాలని, దేశాభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా ప్రతిజ్ఞ చేద్దామని సూచించారు. కేంద్ర ప్రభుత్వం గడచిన కొన్నేళ్లుగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఒక ప్రజా ఉద్యమంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, ఆఫీసులపై జాతీయ జెండాను ఎగురవేస్తూ, తిరంగాతో ఉన్న సెల్ఫీలను ప్రభుత్వ పోర్టల్‌లో అప్లోడ్ చేస్తున్నారు. ఈ సారి కూడా అదే ఉత్సాహంతో దేశవ్యాప్తంగా జాతీయ జెండా పండుగను జరుపుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు.

## పేద పిల్లల కలలకు చిరునామాగా..
# యంగ్ ఇండియా స్కూల్స్
## సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 11 ప్రభాత సూర్యుడు తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు.

**సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్..**

'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.




# అమిత్ షా సభకు రావాలి.. విపక్షాల నినాదాలు..



ఢిల్లీ, ప్రభాత సూర్యుడుపార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్టంభన కొన సాగుతోంది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. మంగళవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు. ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

## పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 11 ప్రభాత సూర్యుడు పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు పత్తి అమ్మే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 2026-27 సీజన్‌లో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా వేశామని తెలిపారు. మంగళవారం సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తిని అంచనా వేస్తున్నామని చెప్పారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు రూ.8,667 ఎంఎస్పీ ధర ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.557ల ఎంఎస్పీ ధర పెరిగిందని తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు 122 నుంచి 131కు పెంచారని వెల్లడించారు.

# మండల పరిషత్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో వైభవంగా బోనాల వేడుకలు

**–పోతురాజుల విన్యాసాలతో అదరగొట్టిన విద్యార్థులు**
**–తెలంగాణ సాంప్రదాయాలను భావితరాలకు అందించేందుకే వేడుకలు**

ప్రభాత సూర్యుడు చందుర్తి :
ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని చందుర్తి మండలం లింగంపేట మండల పరిషత్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల లో శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, భక్తి శ్రద్ధలతో బోనాలను శిరస్సున ధరించి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. బోనాల ఊరేగింపులో విద్యార్థులు పోతురాజుల వేషధారణలో వేసిన విన్యాసాలు, డప్పు చప్పుళ్లకు అనుగుణంగా వేసిన స్టెప్పులు అందరినీ ఆకట్టుకున్నాయి.?అనంతరం పాఠశాల హెడ్ మాస్టర్ రజిత, మాట్లాడుతూ.భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, తెలంగాణ విశిష్ట పండుగల గొప్పతనాన్ని భావి తరాలకు అందించడానికే పాఠశాలలో ఇలాంటి వేడుకల ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆషాడ మాసంలో బోనాల పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందో విద్యార్థులకు వివరిస్తూ, అమ్మవారి దయాకటాక్షాలతో ప్రజలంతా పాడిపంటలతో సుభిక్షంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మౌనిక, విద్యార్థులు, విద్యార్థుల తల్లి తండ్రులు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# స్వర్గీయ దొడ్ల బక్కలయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఘనంగా సేవా కార్యక్రమాలు

**హయత్‌నగర్ 'సుధీర్ ఫౌండేషన్స్'లో నిత్యావసరాలు, వస్త్రాలు పంపిణీ చేసిన గౌతమి స్కూల్ విద్యార్థులు, యాజమాన్యంలి**



ప్రభాత సూర్యుడు హయత్‌నగర్:
గౌతమి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డి. వెంకటయ్య యాదవ్ తండ్రి, స్వర్గీయ దొడ్ల బక్కలయ్య ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని రాఘవేంద్ర నగర్ కాలనీ గౌతమి స్కూల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం హయత్‌నగర్‌లోని 'సుధీర్ ఫౌండేషన్స్' అనాథ శరణాలయంలో భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహి ంచారు.

**మిన్నంటిన దాతృత్వం -- నిత్యావసరాల పంపిణీ**

పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో సేకరించిన బియ్యం, ఆహార పదార్థాలు, కొత్త వస్త్రాలు, స బ్బులు, షాంపూలతో పాటు ఇతర నిత్యావసర వస్తువులను సుధీర్ ఫౌండేషన్స్‌లోని అనాథ చిన్నారులకు అందజేశారు. పండగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా చిన్నారులకు వస్తువులను పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. అనాథ చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించడమే ధ్యేయంగా గౌతమి స్కూల్ నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికుల ప్రశంసలు అందుకంది.

**ఫౌండర్ ఆశయాల సాధనే లక్ష్యం**

ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ... "సమాజానికి మేలు చేయాలి, లేనివారికి చేయూతనందించాలి" అనే తమ ఫౌండర్ గారి ఉన్నతమైన ఆశయానికి అనుగుణంగానే ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో సామాజిక స్పృహ, దయాగుణం, పరోపకార బుద్ధిని పెంపొందించాలనే ఉద్దేశంతో విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసినట్లు పేర్కొన్నారు. స్వర్గీయ దొడ్ల బక్కలయ్య జ్ఞాపకార్థం ఇటువంటి పవిత్రమైన కార్యక్రమం నిర్వహించడం ఎంతో తృప్తిని ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర నగర్ గౌతమి స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, సుధీర్ ఫౌండేషన్స్ నిర్వాహకులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాళేశ్వరం జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

**బీఆర్ఎస్వీ రాష్ట్ర యువ నాయకులు మొకిల్ల శ్రీకాంత్‌రెడ్డి**

ప్రభాత సూర్యుడు – సిద్ధిపేట తెలంగాణలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా? అని బీఆర్ఎస్వీ రాష్ట్ర యువ నాయకులు మొకిల్ల శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కాళేశ్వరం జలాలను ప్రాజెక్టుల ద్వారా పంటలకు అందించి రైతులను తక్షణమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.మంగళవారం సిద్దిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్వీ నాయకులు లచ్చు గారి రంజిత్‌రెడ్డి, కోదాది శివకుమార్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా, హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రిగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి కాళేశ్వరం జలాలను ప్రాజెక్టుల్లోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించేవారని తెలిపారు.ప్రస్తుతం ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను పంటలకు అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో సరైన వర్షాలు లేకపోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలిసినప్పటికీ సాగునీటిని విడుదల చేయకపోవడం పట్ల రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు.మధ్యమానేరు, అన్నపూర్ణ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసి రంగనాయకసాగర్‌ను నింపి సిద్దిపేట ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే సమయంలో రైతులకు సాగునీరు అందేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని విమర్శించారు.సిద్దిపేట మండల పరిధిలో ఇప్పటికే సుమారు 35 వేల ఎకరాల్లో వరి, మక్కజొన్న, టమాట, మిర్చి తదితర పంటలు, అంతర పంటలు సాగు చేశారని, మరో 8 వేల ఎకరాల్లో సాగు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సకాలంలో నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల పంటలను కాపాడేందుకు తక్షణమే కాళేశ్వరం జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే కాంగ్రెస్ మంత్రులు, నాయకుల పర్యటనలను రైతులతో కలిసి బీఆర్ఎస్ అడ్డుకుని నిలదీస్తుందని హెచ్చరించారు. రైతుల సాగునీటి హక్కు కోసం అవసరమైతే పెద్ద ఎత్తున బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని మొకిల్ల శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



# టీ షాపు హెల్పర్ ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు టీ షాపులో హెల్పర్‌గా పనిచేస్తున్న వ్యక్తి గదిలో ఉరేసుకుని మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో పీకే రాజీవన్ అనే వ్యక్తి గత 18 ఏళ్లుగా సిటీ టీ ప్యాలెస్ టీ షాపు నిర్వహిస్తున్నారు. ఆయనకు బావమరిది అయిన కేరళకు చెందిన విపిన్ ఎంకే (38) గత ఆరేళ్లుగా అక్కడ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రెండు నెలలకు ఒకసారి స్వగ్రామానికి వెళ్లి తిరిగి వచ్చేవాడని, జూలై 1న కేరళలోని స్వగ్రామానికి వెళ్లిన విపిన్ జూలై 31న అబ్దుల్లాపూర్‌మెట్‌కు తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి అతడి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పాటు జీవితంపై విసుగు వ్యక్తం చేస్తున్నట్లు ఫిర్యాదుదారు తెలిపారు. మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో విపిన్ తన గదిలోకి వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల వరకు బయటకు రాకపోవడంతో వీరభద్ర అనే వ్యక్తి గదికి వెళ్లి చూడగా, వెంటిలేటర్‌కు లుంగీతో ఉరేసుకుని విపిన్ కనిపించాడు. అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించి విషయాన్ని రాజీవన్‌కు తెలియజేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# గ్రీన్ సిటీ కాలనీలో మహిళ అదృశ్యం

హయత్‌నగర్ – ప్రభాత సూర్యుడు ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుండి బయటికి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హయత్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్ నగర్ లోని గ్రీన్ సిటీ కాలనీలో నివసిస్తున్న లక్ష్మి అనే మహిళ ఇంట్లో నుండి వెళ్లి ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొగ్రాత్ సాయిబాబాకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన పెద్ద కుమార్తె లక్ష్మి (38)కి బాలకృష్ణతో వివాహం కాగా, వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. 2014లో రోడ్డు ప్రమాదంలో బాలకృష్ణ మృతి చెందడంతో అప్పటి నుంచి లక్ష్మి తన ఇద్దరు కుమారులతో కలిసి తండ్రి ఇంట్లోనే ఉంటోంది. ఈ నెల 9న మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో లక్ష్మి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలో వెతికారు. అయినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సాయిబాబా హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.



# డబుల్ లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

పెద్ద అంబర్‌పేట్ – ప్రభాత సూర్యుడు పెద్ద అంబర్‌పేట్‌లోని సర్వే నంబర్ 266 పరిధిలో డబుల్ లేఅవుట్‌కు సంబంధించిన పలు ప్లాట్లలో అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నాగోల్ డిప్యూటీ కమిషనర్ సంపత్ కు రంగారెడ్డి జిల్లా బీఎస్పీ సోషల్ మీడియా కన్వీనర్ యంజాల ప్రహ్లాద్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 266లోని డబుల్ లేఅవుట్‌లో రెండో లేఅవుట్‌కు సంబంధించిన పలు ప్లాట్లలో అనుమతి లేని నిర్మాణాలు కొనసాగుతున్నాయని, ప్లాట్ నంబర్లు 46, 45, 68, 209, 210, 185, 208, 134, 135, 136, 159, 160, 161, 121, 218, 217, 239, 240, 308, 309 తదితర ప్లాట్లలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అదేవిధంగా ప్లాట్ నంబర్లు 219, 249, 222, 244, 223, 245, 224, 246, 225, 226, 227, 228, 229, 250తో పాటు 127--133, 152--158, 79, 66, 62, 63, 80--86, 298, 299, 300--314, 301, 315, 302--316, 306, 307, 320, 321, 322, 323 తదితర ప్రాంతాల్లోనూ అనుమతి లేని నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నిర్మాణాలపై పలువురు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అనుమతి లేని నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, స్థలాలను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



# సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఏర్పాట్లపై సమీక్ష

ఆదిభట్ల – ప్రభాత సూర్యుడు రావిరాల గ్రామంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. షాద్‌నగర్ డీసీపీ రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్‌శాఖల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలకు బారికేడింగ్, ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్షించారు. బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులు చర్చించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ఉత్సవాన్ని సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల పోలీసు విభాగం, దేవాదాయ శాఖ, ట్రాఫిక్ పోలీసులు, విద్యుత్ శాఖ, మున్సిపల్ శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# హయత్‌నగర్ రాఘవేంద్ర నగర్ కాలనీలో ఘనంగా

## శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాలు

**వెయ్యి మందికి పైగా భక్తులకు భారీ అన్నదానం**
**భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన కాలనీ మహిళలు**

ప్రభాత సూర్యుడు హయత్‌నగర్:
హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. కాలనీ అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోట రవీందర్ రెడ్డి, దేవాలయ అధ్యక్షులు కల్వకుంట్ల శేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.



పసుపు, కుంకుమ, వేపాకులతో అందంగా అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. గత రెండేళ్లుగా ఇక్కడ అన్నదానం నిర్వహిస్తుండటం విశేషం కాగా, ఈ ఏడాది వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నదాన ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. "పోచమ్మ తల్లి ఆశీస్సులతో కాలనీ ప్రజలంతా పాడిపంటలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించాము. కాలనీ వాసులందరి సహకారంతో ఈ బోనాల పండుగను ఎంతో ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు కల్వకుంట్ల శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. "అమ్మవారి దయతో ఉత్సవాలు ఎంతో ప్రశాంతంగా, వైభవంగా జరిగాయి. గత రెండేళ్లుగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నాము. ఈసారి కూడా వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశాము. భవిష్యత్తులోనూ అందరి సమన్వయంతో ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ జనరల్ సెక్రటరీ బెజవాడ నరహరి, ట్రెజరర్ సూర్యనారాయణ, కమిటీ సభ్యులు కైలాష్ నాథ్, ధర్మారెడ్డి, గుడాల మల్లేష్, ఎల్లారెడ్డి, ఆర్. కీర్తి, హేమలత, శోభారాణి, కమలమ్మ, పద్మ, ఇందిరా, సిహెచ్. శైలజ, మంజుల, రజిత, సరళమ్మ, గాలమ్మ, అనురాధ, కే. పద్మ, జె. సత్తిరెడ్డి, కిషన్, లింగారెడ్డి, జనార్దన్ రెడ్డి, జంగారెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎల్బీనగర్ ఓల్డ్ విలేజ్‌లో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు

**అమ్మవారి సేవలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోలే ప్రదీప్**

ప్రభాత సూర్యుడుఎల్బీనగర్:
ఎల్బీనగర్ ఓల్డ్ విలేజ్‌లో ఆదిశక్తి టీం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు అత్యంత ఘనంగా, కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకలకు టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) సీనియర్ నాయకులు పోలే ప్రదీప్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.



ఉత్సవ ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు నిర్వాహకులు, స్థానికులు డప్పు చప్పుళ్ల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలే ప్రదీప్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహలం, పోతరాజుల విన్యాసాల మధ్య అత్యంత వైభవంగా జరిగిన ఘటాల ఊరేగింపులో కూడా ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలే ప్రదీప్‌హొహొమాట్లాడుతూ.. ఆ చల్లని తల్లి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ ఎలాంటి ఆటంకాలు లేకుండా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో కలకాలం వర్ధిల్లాలని, ప్రతి ఇల్లు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మనసారా ప్రార్థించినట్లు ఆయన తెలియజేశారు. ఇలాంటి పండుగలు మన సంస్కృతికి, ప్రజల మధ్య ఐక్యతకు ప్రతీక అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాయి యాదవ్, పవన్, నాగ సాయి, గణేష్ తదితరులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు, స్థానిక నాయకులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# అఖిలాండ శక్తి స్వరూపిణులు
# వేములవాడలో కొలువుదీరడం ప్రజల అదృష్టం

**ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

ప్రభాత సూర్యుడువేములవాడ :
ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగాజరుగుతున్నాయి.ప్రతినిత్యం అమ్మవార్ల ఆరాధనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడితో అలరిస్తుంది.ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలునిర్వహించారు.అనంతరం ఆలయంలో కొలువుదీరిన శ్రీ ఉజ్జయిని మహంకాళి,శ్రీ ప్రత్యంగిరా,శ్రీ భగలాముఖి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్



మాట్లాడుతూ ఆషాఢ మాసం ప్రజలందరికీ పవిత్రమైన మాసమని పేర్కొన్నారు.బోనాల జాతర మహోత్సవాలలో అమ్మవార్లను దర్శించుకోవడం తాను చేసుకున్న పుణ్యమన్నారు.ఆలయంలో శ్రీ ఉజ్జయిని మహంకాళి,శ్రీ ప్రత్యంగిరా,శ్రీ భగలాముఖి అమ్మవార్లు ఒకే చోట కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వడం వేములవాడ ప్రజలఅదృష్టమనితెలియజేశారు.అఖిలాండ శక్తి స్వరూపిణులైన అమ్మవార్ల కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగాఆకాంక్షించారు.అమ్మవార్ల దయతో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని,రైతులు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.ప్రజలంతా ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు.ఆషాఢ మాసం పురస్కరించుకొని ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బోనాల జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేకంగాఅభినందించారు.ముఖ్యంగా ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్‌ను ప్రత్యేకంగాఅభినందిస్తూ,ఆలయ అభివృద్ధి,భక్తుల సౌకర్యాల కల్పనలో కమిటీ చేస్తున్న కృషిని ప్రశంసించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.అనంతరం అమ్మవార్ల చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు,కౌన్సిలర్ తుమ్ మధు,కౌన్సిలర్లు తోట రాజు,కొండ శేఖర్,అన్నారం శ్రీనివాస్,కుమ్మరిశ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,నాగుల విష్ణు ప్రసాద్, పాత సత్యలక్ష్మి, బైరి సతీష్ ముదిరాజ్ లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు కందుల క్రాంతి కుమార్,భివండిశ్రీనివాస్,నరేష్ ,మైలారం రాము తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. పంట మార్పిడికి కలెక్టర్ పిలుపు

## సాగునీరు అందుబాటులో లేదు.. ప్రస్తుత నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలి: కలెక్టర్ హైమావతి

ప్రభాత సూర్యుడు సిద్ధిపేట:
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో జిల్లాలోని రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు.



ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినందున రైతులు వరి సాగు చేయవద్దని స్పష్టం చేశారు.
మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నీటిపారుదల సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రాజెక్టుల్లో పరిమిత నీటి నిల్వలు**

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రస్తుతం పరిమిత స్థాయిలోనే నీటి నిల్వలు ఉన్నాయని గజ్వేల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్ శివధర్మతేజ సమావేశంలో వివరించారు. అన్నపూర్ణ సాగర్‌లో 1.51 టీఎంసీలు, రంగనాయక సాగర్‌లో 0.99 టీఎంసీలు, మల్లన్న సాగర్‌లో 13.86 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 6.31 టీఎంసీలు, శనిగరం ప్రాజెక్టులో 0.46 టీఎంసీల నీరు ఉన్నట్లు తెలిపారు. డెడ్ స్టోరేజీని మినహాయిస్తే వినియోగానికి అందుబాటులో ఉన్న నీటి పరిమాణం మరింత తక్కువగా ఉందని పేర్కొన్నారు.వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు.

**వరి సాగు చేయవద్దు**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని కలెక్టర్ హైమావతి తెలిపారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల్లోకి కొత్తగా నీరు చేరకపోవడంతో ప్రస్తుతం ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించినట్లు చెప్పారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మళ్లీ వర్షాలు కురిసే వరకు ప్రాజెక్టుల నీటిని సాగుకు విడుదల చేసే పరిస్థితి లేదన్నారు.
గత ఏడాది జిల్లాలో 4.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, అందులో 3.68 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ప్రభుత్వం రూ.1,200 కోట్లకు పైగా చెల్లించిందన్నారు.

**70 వేల ఎకరాల్లో పంట మార్పిడి**

వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించడంతో ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 70 వేల ఎకరాల్లో పంట మార్పిడి జరిగిందని కలెక్టర్ తెలిపారు. కందులు, పెసర్లు, మినుములు, చిరుధాన్యాలు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. ఆగస్టు 15 తర్వాత ఆముదం, పత్తి, ఇతర నూనెగింజల పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు.
ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు కురిస్తే సాగునీటి ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు.

**చెక్‌డ్యామ్‌లు నింపాలని యాదవ రెడ్డి సూచన**

ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసి గూడవల్లి, హల్దివాగు ప్రాంతాల్లోని చెక్‌డ్యామ్‌లను నింపితే రైతులకు కొంతమేర వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంటుందని, ఆ దిశగా పరిశీలించాలని సూచించారు.

**గోదావరి నీటిని లిఫ్ట్ చేయాలి**

సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పంపిన లేఖను కలెక్టర్ సమావేశంలో చదివి వినిపించారు. గోదావరి నది నుంచి వృథాగా సముద్రంలోకి వెళ్లే నీటిని లిఫ్ట్ చేసి ప్రాజెక్టులను నింపాలని, తద్వారా రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని లేఖలో కోరినట్లు తెలిపారు. అలాగే భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు. సమావేశంలో కరీంనగర్ సర్కిల్ సీఈ
సత్యనారాయణ రెడ్డి, ఎస్ ఈలు సూర్యకిరణ్, లక్ష్మణ్ ప ల్లంరాజు, జిల్లా




ఇరిగేషన్ అధికారి నాగరాజు, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దగుండవెల్లిలో ఘనంగా స్వచ్ఛత పక్వాడా

ప్రభాత సూర్యుడు: సిద్ధిపేట:



దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామంలో మై భారత్ (కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ) ఆధ్వర్యంలో, రామసేన యూత్ సహకారంతో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్వాడాలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామంలోని జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేశారు. ముఖ్యంగా మహాత్మా గాంధీ విగ్రహం పరిసరాల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వాటి పరిసర ప్రాంతాలను కూడా శుభ్రం చేసి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.అనంతరం యువజన సంఘ సభ్యులు, యువత, గ్రామస్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించాలని అవగాహన కల్పించారు."స్వచ్ఛత మన బాధ్యత -- పరిశుభ్రమైన గ్రామమే మన లక్ష్యం" అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యువత ముందుండి పనిచేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు బాయికాడి లక్ష్మణ్, చేపూరి విజయ్ కుమార్, దుర్గ ప్రసాద్, సాయి, రాహుల్, బన్ని తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ ఎస్ పి సి 2026 నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటీషన్లో పలు విభాగాల్లో సర్టిఫికెట్లు సాధించిన కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు

ప్రభాత సూర్యుడు వేములవాడ :





పర్యావరణహితం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎం ఎస్ పి సి 2026 నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటీషన్లో కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు ఆన్లైన్లో ఎగ్జామ్ రాసి పలు విభాగాలలో సర్టిఫికెట్స్ పొందారు డైమండ్ విభాగంలో 35 మంది విద్యార్థులు, గోల్డ్ విభాగంలో 16 మంది విద్యార్థులు, సిల్వర్ విభాగంలో 04 మంది విద్యార్థులు, బ్రౌన్ విభాగంలో 05 మంది విద్యార్థులు సర్టిఫికెట్స్ సాధించారు. ఈ సర్టిఫికెట్స్ సాధించిన విద్యార్థులకు కరస్పాండెంట్ నరాల దేవేందర్, డైరెక్టర్ ఫసి,ప్రిన్సిపాల్ ధరక్షన్ వసు పియా బహుమతులను అందజేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.
చదువుతోపాటు విద్యార్థులలో సమాజ హితం కోసం ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పర్యావరణం గురించి పిల్లలలో అవగాహన పెరుగుతుందని ప్రిన్సిపాల్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు



## విశ్వనాథ్ అండ్ సన్స్.. స్మార్ట్ మూవ్

ఒక పెద్ద స్టార్ హీరో సినిమా వస్తుందంటే చాలు.. టికెట్ రేట్లు అమాంతం పెంచేయడం ఒక ట్రెండ్ లా మారిపోయింది. కానీ సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా మాత్రం ఈ రూట్ ని పూర్తిగా పక్కన పెట్టేసింది.ఒక పెద్ద స్టార్ హీరో సినిమా వస్తుందంటే చాలు.. టికెట్ రేట్లు అమాంతం పెంచేయడం ఒక ట్రెండ్ లా మారిపోయింది. కానీ సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా మాత్రం ఈ రూట్ ని పూర్తిగా పక్కన పెట్టేసింది. ఆగస్టు 14న థియేటర్లలోకి రాబోతున్న



ఈ సినిమా కోసం ఎలాంటి రేట్ల పెంపు లేకుండా నార్మల్ ప్రైస్ కే టికెట్లు ఇవ్వాలని మేకర్స్ డిసైడ్ అయ్యారు. ఫ్యామిలీ ఆడియన్స్ ని భారీ సంఖ్యలో థియేటర్లకు రప్పించడానికి ఇదొక స్మార్ట్ ప్లాన్ అని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. సినిమా కంటెంట్ మీద ఉన్న నమ్మకమే మేకర్స్ కి ఇంత కాన్ఫిడెన్స్ ఇస్తోందని అర్థమవుతోంది. రీసెంట్ గా వచ్చిన ట్రైలర్ కు సోషల్ మీడియాలో సూపర్ రెస్పాన్స్ వచ్చింది. వెంకీ అట్లూరి మార్క్ ఎమోషన్స్, క్యూట్ రొమాన్స్, ఫ్యామిలీ డ్రామా అన్నీ పర్ఫెక్ట్ గా కుదిరాయి. పక్కా కమర్షియల్ హంగుల కంటే కూడా కథలోని ఫీల్ గుడ్ ఎలిమెంట్స్ ని గట్టిగా నమ్ముకుని ఈ ప్రాజెక్ట్ ని చాలా బ్యూటిఫుల్ గా తీర్చిదిద్దినట్లు విజువల్స్ చెబుతున్నాయి. ప్రతి ఫ్రేమ్ లోనూ ఒక పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది.ఇందులో సూర్యకు జోడీగా నటించిన మమితా బైజు స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాకు ఒక ఫ్రెష్ లుక్ తీసుకొచ్చింది. ఆమె ఎనర్జిటిక్ యాక్టింగ్ తో పాటు చార్ట్ బస్టర్ గా నిలిచిన సాంగ్స్ ఆడియన్స్ కు బాగా కనెక్ట్ అయ్యాయి. సినిమా ప్రమోషనల్ ఈవెంట్స్ కూడా ఈ పాజిటివిటీని అమాంతం పెంచేస్తున్నాయి. రేపు హైదరాబాద్ లో గ్రాండ్ గా జరగబోయే తెలుగు ప్రీ రిలీజ్ ఈవెంట్ కోసం సూర్య ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఈ ఈవెంట్ తో రిలీజ్ వీక్ లో సినిమా మీద మరింత స్ట్రాంగ్ బజ్ క్రియేట్ అవ్వడం గ్యారెంటీ. రేట్ల పెంపు లేకపోవడం అనే ఒకే ఒక్క పాయింట్ ఇప్పుడు మిడిల్ క్లాస్ ప్రేక్షకులకు బాగా చేరువైంది. ఫ్యామిలీస్ అంతా కలిసి సినిమాకి వెళ్లాలంటే బడ్జెట్ గురించి ఆలోచించుకునే ఈ రోజుల్లో, మేకర్స్ తీసుకున్న ఈ నిర్ణయం బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ ఫుట్ ఫాల్స్ తీసుకురావడం ఖాయం. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. కంటెంట్ తో మెప్పించడమే కాకుండా, సామాన్య ప్రేక్షకుడి జేబుకు ఏమాత్రం భారం కాకుండా వస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఏ స్థాయిలో సక్సెస్ అవుతుందో చూడాలి. ఈ సినిమాలో సూర్య పాత్ర కూడా డిఫరెంట్ షేడ్స్ లో ఉండబోతోంది

## అఖిల్, నితిన్ సినిమాలు..
## ఆ తప్పులపై డైరెక్టర్ రియలైజేషన్

దర్శకుడు వెంకీ అట్లూరి 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే భారీ ప్రాజెక్ట్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. దర్శకుడు వెంకీ అట్లూరి 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే భారీ ప్రాజెక్ట్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 14న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఇక ప్రమోషనల్ ఈవెంట్లలో భాగంగా వెంకీ తన గత సినిమాల రిజల్ట్స్ పై ఓపెన్ గా మాట్లాడాడు. తన కెరీర్ లో ఎదురైన ఒడిదుడుకులను పబ్లిక్ గా ఒప్పుకుంటూ కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నాడు. అఖిల్ అక్కినేనితో తీసిన మిస్టర్ మజ్ను సినిమాలో తప్పులు జరిగాయని వెంకీ ఎలాంటి మొహమాటం లేకుండా డైరెక్ట్ గా అంగీకరించాడు. ఆ సినిమా సెకండాఫ్ విషయంలో తను ఇంకాస్త బెటర్ గా ఫోకస్ చేసి ఉంటే రిజల్ట్ కచ్చితంగా వేరేలా ఉండేదని చెప్పాడు. ఒక డైరెక్టర్ ఇలా తన సినిమాలోని లోపాలను దాచుకోకుండా పబ్లిక్ ప్లాట్ ఫామ్ మీద ఒప్పుకోవడం చాలా రేర్ అని చెప్పొచ్చు. తన



తప్పులను రియలైజ్ అయ్యి ముందుకు సాగుతున్న తీరును నెటిజన్లు అభినందిస్తున్నారు.నితిన్ తో తీసిన రంగ్ దే సినిమా గురించి చెబుతూ.. ఆ ప్రాజెక్ట్ మాత్రం ఒక ఇన్నోసెంట్ విక్టిమ్ అంటూ వెంకీ ఫీల్ అయ్యాడు. ఆ కంటెంట్ చాలా ఇన్నోసెంట్ గా ఉంటుందని, బహుశా వేరే టైమ్ లో లేదా వేరే రోజు రిలీజ్ అయ్యుంటే దాని రిజల్ట్ మరోలా ఉండేదని తన మనసులోని మాట బయటపెట్టాడు. కొన్నిసార్లు రిలీజ్ టైమింగ్స్, మనం తీసుకునే నిర్ణయాల వల్ల మంచి సినిమాలు కూడా బాక్సాఫీస్ దగ్గర ఎఫెక్ట్ అవుతాయని చాలా క్లియర్ గా వివరించాడు. సినిమాల మధ్య కచ్చితంగా కొంత గ్యాప్ ఉండాలని, ప్యాకేజింగ్ కరెక్ట్ గా ఉంటేనే రిజల్ట్ పాజిటివ్ గా వస్తుందని వెంకీ స్పష్టం చేశాడు. పాత సినిమాల ఫ్లాప్స్ నుంచి నేర్చుకున్న పాఠాలతోనే ఇప్పుడు సూర్యతో చేస్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్ కథను చాలా కేర్ ఫుల్ గా డిజైన్ చేశాడట. ముఖ్యంగా హీరో హీరోయిన్ల మధ్య ఉన్న ఏజ్ గ్యాప్ కాన్సెప్ట్ ని ఈ కథలో చాలా ఇంట్రెస్టింగ్ గా అడ్రెస్ చేసినట్లు, అది సినిమాకు హైలైట్ గా నిలుస్తుందని వెల్లడించాడు. పాత్రల మధ్య బాండింగ్ ని ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యేలా చూపించడం తన స్పెషాలిటీ అని మరోసారి ప్రూవ్ చేసేలా ఈ సినిమా ఉండబోతోందని ఒక హింట్ ఇచ్చాడు. సూర్య, మమితా బైజు, ఒక చిన్న బాబు చుట్టూ తిరిగే ఈ స్టోరీలో ఎమోషన్స్ చాలా నాచురల్ గా వర్కౌట్ అవుతాయట. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా స్క్రిప్ట్ ని చాలా పక్కాగా రాసుకున్నట్లు వెంకీ మాటల్ని బట్టి అర్థమవుతోంది. పక్కా కమర్షియల్ హంగుల కంటే కూడా కథలోని కంటెంట్, పాత్రల స్వభావమే విశ్వనాథ్ అండ్ సన్స్ కు మేజర్ ప్లస్ పాయింట్ కానున్నాయని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. ఎలాంటి ప్రమోషనల్ ఆర్భాటం లేకుండా వస్తున్న ఈ సినిమాపై వెంకీ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. సూర్యతో కలిసి చేసిన ఈ డిఫరెంట్ ఎమోషనల్ అటెంప్ట్ జనాలను ఏ స్థాయిలో మెప్పిస్తుందో మరికొన్ని రోజుల్లో థియేటర్లలో తేలిపోనుంది.

## అనిరుధ్‌కు ప్రశంసలు.. తమన్‌కు ట్రోల్స్


ప్రస్తుతం సౌత్ ఇండియాలో నంబర్ వన్ మ్యూజిక్ డైరెక్టర్ ఎవరంటే మరో మాట లేకుండా అనిరుధ్ రవిచందర్ పేరు చెప్పేయొచ్చు. ప్రస్తుతం సౌత్ ఇండియాలో నంబర్ వన్ మ్యూజిక్ డైరెక్టర్ ఎవరంటే మరో మాట లేకుండా అనిరుధ్ రవిచందర్ పేరు చెప్పేయొచ్చు. వేరే సంగీత దర్శకులు క్వాంటిటీ విషయంలో అతణ్ని దాటొచ్చు కానీ.. క్వాలిటీ పరంగా చూస్తే అతడికి తిరుగులేదు. అనిరుధ్ పని చేస్తున్నాడు అంటే ఆ సినిమా సంగీతం వేరే లెవెల్లో ఉంటుంది.. అది సినిమాకు పెద్ద అసెట్ అవుతుంది.. తన సంగీతం కోసమే సినిమా చూడొచ్చు అని అందరూ బలంగా నమ్ముతారు. ఆ నమ్మకాన్ని ప్రతిసారీ అతను నిలబెట్టుకుంటూ ఉంటాడు. అనిరుధ్‌కు దీటుగా నిలబడాలని, అతణ్ని దాటిపోవాలని వేర మ్యూజిక్ డైరెక్టర్లు ప్రయత్నిస్తుంటారు కానీ అదంత తేలిక కాదు. గత ఏడాది తమన్ ఈ విషయంలో ఓపెన్ ఛాలెంజ్ కూడా చేశాడు. అనిరుధ్ పని చేసిన జైలర్, లియో లాంటి సినిమాలను ప్రస్తావిస్తూ.. వాటన్నింటికీ 'ఓజీ' మన సమాధానం అన్నాడు. ఆ సినిమా వరకు అనిరుధ్‌కు తమన్ దీటుగానే నిలిచాడు. ఓజీ పాటలు, బీజీఎంకు అదిరిపోయే స్పందన వచ్చింది. కానీ తమన్ ప్రతి సినిమాకు అంత టైం పెట్టి, శ్రద్ధతో చేయడు. అందుక్కారణం అతను చాలా సినిమాలకు పని చేస్తుంటాడు. తనకు టైం తక్కువ. కొన్ని సినిమాలకు మొక్కుబడిగా



మ్యూజిక్ లాగించేస్తుంటాడు. 'కొరియన్ కనకరాజు' ఆ కోవకు చెందిన సినిమానే అని చెప్పాలి. ఈ సినిమాలో పాటలు, బీజీఎంలో ఏ స్పెషాలిటీ కనిపించలేదు. మ్యూజిక్ విషయంలో బాగా విమర్శలు కూడా వస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని చోట్ల 'ఓజీ' బీజీఎంను రిపీట్ చేశాడంటూ అతణ్ని ట్రోల్ చేస్తున్నారు. పెద్ద సినిమాలకు పెట్టే శ్రద్ధను చిన్న, మిడ్ రేంజ్ చిత్రాల కోసం కొంతైనా పెట్టవా అంటూ అతణ్ని విమర్శిస్తున్నారు. ఇదే సమయంలో అనిరుధ్ 'డీసీ' అనే మిడ్ రేంజ్ మూవీకి బ్యాంగ్ బ్యాంగ్ మ్యూజిక్ ఇచ్చి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. కంటెంట్ పరంగా 'డీసీ' మరీ గొప్ప సినిమా కాదు. కథ రొటీనే అయినా.. టేకింగ్ చాలా బాగుంటుంది. ఎమోషన్లు వర్కవుట్ అయ్యాయి. ఐతే ఓ మోస్తరుగా అనిపించే సన్నివేశాలను కూడా తన బీజీఎంతో అనిరుధ్ వేరే లెవెల్లో నిలబెట్టాడు. ఎమోషన్లు పండడంలో కూడా తన స్కోర్ కీలక పాత్ర పోషించింది. ఈ స్థాయి సినిమా కోసం అతను అంత మనసు పెట్టి పని చేయడం.. 'కల్ట్' అనిపించే మ్యూజిక్ ఇవ్వడం పట్ల ప్రశంసల జల్లు కురుస్తోంది. ఎంతో ప్యాషన్‌తో పని చేస్తే తప్ప ఇలాంటి ఔట్ పుట్ రాదని.. సినిమా స్థాయి చూడకుండా ఇలాంటి చిత్తశుద్ధిని ప్రదర్శించాలని.. క్వాంటిటీ కంటే క్వాలిటీ ముఖ్యం అని వ్యాఖ్యానిస్తున్న నెటిజన్లు అనిరుధ్‌తో పోల్చి తమన్‌ను ట్రోల్ చేస్తున్నారు.

## సంక్రాంతి రేసులో
## సాయి ధరమ్ తేజ్.. నిజమేనా..?

సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'సంబరాల ఏటి గట్టు' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. దర్శకుడు రోహిత్ కేపీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కే నిరంజన్ రెడ్డి దాదాపు రూ. 120 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.గతంలో తమ బ్యానర్‌లో వచ్చిన 'హనుమాన్' చిత్రం జనవరి 12న విడుదలై ఎంతటి ఘనవిజయం సాధించిందో, అదే సెంటిమెంట్‌తో 'సంబరాల ఏటి గట్టు' చిత్రాన్ని కూడా జనవరి 12, 2027న పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



దీంతో సాయి ధరమ్ తేజ్ కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాతో సంక్రాంతి బరిలో దిగేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తుండగా జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదట డిసెంబర్ 2026లో ఈ సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికీ, సంక్రాంతి సీజన్ అనుకూలంగా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారు. మరి దీనిపై అఫీషియల్ క్లారిటీ ఎప్పుడు వస్తుందో చూడాలి.


## 'ఇరుముడి' సినిమాలో
## శబరిమలతో సంబంధం లేదట..!



మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ కాంబోలో రాబోతున్న 'ఇరుముడి' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా, ఈ సినిమా శబరిమల యాత్రతో సంబంధం లేదని దర్శకుడు స్పష్టం చేశారు.హీరో చేపట్టిన 41 రోజుల అయ్యప్ప దీక్ష ఆయన జీవితంలో ఎలాంటి మార్పులు తెచ్చింది, ఆ సమయంలో ఎదురైన సవాళ్లు ఏమిటనేదే కథాంశమని దర్శకుడు వెల్లడించాడు. ఒక లోపమున్న వ్యక్తి అయ్యప్ప దీక్ష తీసుకుంటే మద్యం వదిలేయాల్సి వస్తుందని, ఆ నియమం ద్వారా వచ్చే కాన్‌ఫ్లిక్ట్‌నే ప్రధానాంశంగా తీసుకున్నట్లు తెలిపాడు.మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా, బేబీ నక్షత్ర రవితేజ కుమార్తెగా నటించగా జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించాడు. ఈ చిత్రం ఆగస్టు 21న విడుదల కానుంది.

## ప్రమోషన్ భయంలో లేడీ సూపర్ స్టార్!

ఈ మార్పులో భాగంగానే తాజాగా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న –టాక్సిక్– చిత్రానికి సంబంధించిన లైవ్ ఈవెంట్‌కు నయన్ స్వయంగా హాజరై ఆశ్చర్యపరిచారు. లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ ప్రత్యేకమైన సామ్రాజ్యాన్ని సృష్టించుకున్న నటి నయనతార గురించి చెప్పాల్సిన పనిలేదు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించిన నయన్ ఇండస్ట్రీలో విభిన్నమైన ట్రెండ్‌ను ఫాలో అయ్యేవారు. సినిమా షూటింగ్ పూర్తి కాగానే ప్రమోషన్ కార్యక్రమాలకు, ఇంటర్వ్యూలకు దూరంగా ఉండటం అమ్మడి నైజం. అయితే కాలం మారుతున్న కొద్దీ చిత్ర పరిశ్రమలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నయనతార పద్ధతిని పూర్తిగా మార్చుకుంటున్నారు. ఒకప్పుడు సినిమా ఎంత పెద్దదైనా? ఎలాంటి క్రేజీ ప్రాజెక్ట్ అయినా? నయనతార మాత్రం ప్రమోషన్లకు ఎప్పుడూ హాజరయ్యే వారు కాదు. రిలీజ్ పై నమ్మకంతో ఓ ప్రమోషనల్ ఈవెంట్లలో పాల్గొనకుండానే తన సినిమాలను విజయాల బాట పట్టించారు. కానీ ఇటీవలి కాలంలో ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. తాజాగా –మన శంకరవరప్రసాద్ గారు– కోసం అమ్మడు నేరుగా కాకపోయినా ప్రత్యేకంగా ప్రమోషనల్ వీడియోలు చేసి చిత్ర యూనిట్‌కు తన వంతు సహకారం అందించారు. ప్రేక్షకులను థియేటర్ల వైపు రప్పించడంలో ఆ వీడియోలు కీలక పాత్ర పోషించాన్నది కాదనలేని నిజం. ఈ మార్పులో భాగంగానే తాజాగా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న –టాక్సిక్– చిత్రానికి సంబంధించిన లైవ్ ఈవెంట్‌కు నయన్ స్వయంగా హాజరై ఆశ్చర్యపరిచారు. యష్ హీరోగా గీతు మోహన్ దాస్ దర్శకత్వంలో



రూపుదిద్దుకుంటున్న భారీ చిత్ర వేడుకలో నయనతార పాల్గొనడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇన్నాళ్లు ప్రమోషన్లకు దూరంగా ఉన్న అమ్మడు ఇప్పుడిలా నేరుగా లైవ్ ఈవెంట్లలో కనిపించడంతో అభిమానులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నయన్ లో వస్తోన్న సానుకూల మార్పు సినిమాకు మరింత హైప్‌ను తీసుకొస్తుంది. దీంతో ఇతర సినిమాల విషయంలో కూడా నయనతార ఇంతే పాజిటివ్ గా ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఇకపై తాను నటించే ప్రతి సినిమా ప్రచార కార్యక్రమాలకు తప్పకుండా హాజరవుతుందని.. ఆరకంగా ప్లాన్ చేసు కుంటున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతుంది. ఇందుకు ప్రధాన కారణం ప్రస్తుత బాక్సాఫీస్ పరిస్థితులే అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎంత పెద్ద స్టార్ నటి అయినా? సినిమాను ప్రేక్షకులకు సరిగ్గా రీచ్ చేయకపోతే బాక్సాఫీస్ వద్ద ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితి నెలకొంది. మారిన బిజినెస్ సమీకరణాల నేపథ్యంలో సినిమా చేయడం మాత్రమే కాకుండా దాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత నటీనటులపై కూడా ఉందనేది అంతే వాసత్వం.ఒకవేళ నటీనటులు ప్రమోషన్లకు పూర్తిగా దూరంగా ఉంటే, నిర్మాతలు కూడా భవిష్యత్తులో అలాంటి వారిని లైట్ తీసుకునే ప్రమాదకరమైన పరిస్థితికి పరిశ్రమ వచ్చేసింది. సోషల్ మీడియా హవా పెరిగిన రోజుల్లో ప్రమోషన్లు లేకపోతే సినిమాపై ఆశించిన స్థాయిలో బజ్ ఏర్పడటం కష్టమవుతోంది. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన కొందరు తారలు నిర్మాతల ఇబ్బందిని అర్థం చేసుకుంటూ పంథాను మార్చుకుంటున్నారు. ఇది నిజంగా ప్రశంసనీయం. నయనతార సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నడు లేని విధంగా ప్రమోషన్ల కోసం ముందుకు రావడం ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555